# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి ఎన్నికను ఈరోజు నిర్వహిస్తారు.**
2. **బొగ్గు గనుల వేలంతో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా లబ్ధి చేకూరుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం మంత్రి వి.అనిత హెచ్చరించారు.**
4. **తెలంగాణలోని రైతులందరికీ 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని మంత్రిమండలి నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**
5. **ప్రపంచ వ్యాప్తంగా వర్షారణ్యాల సంరక్షణ దినోత్సవం ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి పదవికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నర్సీపట్నం శాసనసభ్యులు అయ్యన్నపాత్రుడు నామినేషన్ దాఖలు చేశారు. నిన్న వెలగపూడి శాసనసభ కార్యాలయంలో ఆయన తరఫున కూటమి నేతలు నామినేషన్ పత్రాలను శాసనసభ కార్యదర్శికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ పాల్గొన్నారు.

కాగా.. ఈరోజు ఉదయం 11 గంటలకు శాసనసభాపతితో పాటు ఉప సభాపతికి ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు శాసనసభలో నిన్న ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి 172 మంది శాసనసభ్యులతో ప్రమాణం చేయించగా, ఇతరత్రా కారణాలతో పి.సత్యనారాయణ, వి.వెంకటేశ్వరరావు, జీవీ ఆంజనేయులు నిన్న ప్రమాణస్వీకారం చేయలేదు. ఆ ముగ్గురితో ఈ రోజు ప్రమాణం చేయించనున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం మంత్రి వి.అనిత హెచ్చరించారు. నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, మూడు నెలల్లో మాదకద్రవ్యాల రవాణాపై చర్యలు చేపట్టి గంజాయిని అరికడతామన్నారు. మాదకద్రవ్య వ్యసన చికిత్స కేంద్రాల సంఖ్యను పెంచుతామని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు )

--------------------------

బొగ్గు గనుల వేలంతో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా లబ్ధి చేకూరుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. నిన్న హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పదో విడత బొగ్గు గనుల వేలం కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి సంస్థను కాపాడాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలోని సింగరేణిని మరింత అభివృద్ధి చేస్తామని, సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలగకుండా చూస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని వేలం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆదాయం కోసం మాత్రమే బొగ్గు గనుల వేలం వేయడం లేదన్నారు. సింగరేణి విషయంలో బొగ్గుగనుల శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉందని, ఈ విషయాన్ని ఎవరూ రాజకీయం చేయకూడదని కోరారు. బొగ్గు గనుల వేలం వల్ల రాష్ట్రాలకే ఆదాయం వస్తుందని అని కిషన్‌రెడ్డి వివరించారు.

---------------------------

తెలంగాణలోని రైతులందరికీ గడువులోగా 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రైతు రుణమాఫీ, రైతుభరోసాపై మంత్రిమండలి సమావేశం జరిగింది. మంత్రిమండలి నిర్ణయాలనుముఖ్యమంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. రుణమాఫీ విధివిధానాలను పూర్తిస్థాయిలో చర్చించిన తరువాత మంత్రివర్గం ఆమోదించిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

...వాయిస్... 30 సెకన్లు

---------------------------

ఆకాశవాణి వార్తలు దేశంలో అత్యంత విశ్వసనీయమైన వార్తలుగా గుర్తింపు పొందాయని ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం రైటర్స్ జర్నలిజం అధ్యయన విద్యా సంస్థ తెలిపింది. ఈ సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో దేశంలోని మీడియా రంగంలో ఆకాశవాణి వార్తలకు ఉన్నత స్థానం ఉందని గుర్తించినట్లు తెలిపింది. 2024 వార్షిక డిజిటల్ న్యూస్ రిపోర్ట్ నివేదికలో ఈ విషయం పేర్కొంటూ రైటర్స్ సంస్థ దేశంలో ఇతర మీడియా సంస్థల కంటే ఆకాశవాణి ముందంజలో ఉందని తెలిపింది. కాగా రైటర్స్ సంస్థ గుర్తింపు ఆకాశవాణి వార్తల అచంచల నిబద్ధతకు ఒక ఉదాహరణ అని ప్రసారభారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ అన్నారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా వర్షారణ్యాల సంరక్షణ దినోత్సవం ఈరోజు జరుపుకుంటున్నారు. ప్రప్రథమంగా 2017 జూన్ 22వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. భూమిపై జీవులకు వర్షం ప్రధాన జీవనాధరం. వర్షాలు మనకు త్రాగునీరు అందించడంతోపాటు వాతావరణ పరిస్థితులను సమతుల్యంలో ఉంచడానికి దోహదపడతాయి. గత 40 ఏళ్ళలో వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లో 10 లక్షల హెక్టార్ల మేర అడవులను నరికి వేయడంతో ప్రపంచ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న తరుణంలో వర్షపు నీటిని సంరక్షించుకోవడానికి అవసరమైన అవగాహన కార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా వర్షారణ్యాల సంరక్షణ దినోత్సవ సందర్భంగా చేపడుతున్నారు. "వర్షారణ్యాల రక్షణకు ప్రపంచాన్ని శక్తివంతం చేయడం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది వర్షారణ్యాల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అతిసార వ్యాధి నియంత్రణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలో నిన్న మంత్రి మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు కలుషితం అవకుండా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని పేర్కొంటూ,

వాయిస్ (30సెకన్లు )

---------------------------

వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో భానుడి భగభగలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వేడిగాల్పుల బారిన పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? వంటి విషయాల గురించి ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన "అధిక ఉష్ణోగ్రతలు-తీసుకోవలసిన జాగ్రత్తలు" పై ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారం చేస్తుంది.

---------------------------

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించాయని, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తా, రాయలసీమల్లోని పలు ప్రాంతాల్లో ఈరోజు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ రోజు అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.

తెలంగాణలో రానున్న 3 రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ సహా పలు జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. ఈ రోజు తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

తెలంగాణలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఈడీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి జులై 6 నుంచి 15 వరకు కామన్ పీజీ ప్రవేశ పరీక్ష-సీపీగెట్ నిర్వహించనున్నట్లు సీపీగెట్ కన్వీనర్ ఆచార్య ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్ విధానంలో జరిగే పరీక్షల తేదీలను నిన్న ఆయన వెల్లడించారు. మొత్తం 45 సబ్జెక్టులకు గాను రోజుకు మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 71 వేల మంది దరఖాస్తు చేశారన్నారు. అభ్యర్థులు జులై 3వ తేదీ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

---------------------------

తెలంగాణలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా రైస్ మిల్లుల సామర్థ్యాన్ని పెంచుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైస్ మిల్లర్లకు సూచించారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిన్న హైదరాబాద్‌లో '16వ అంతర్జాతీయ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో- 2024'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైస్ మిల్లింగ్, నాణ్యమైన బియ్యం ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

=====================